ప్రజాశక్తి

సోమవారం 8 జనవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మిర్చి ధరలు నేల చూపులు



పెదకూరపాడు వద్ద కళ్లాల్లోని మిర్చి గ్రేడింగ్

వారంలో క్వింటాల్‌కు రూ.3-5 వేల వరకు తగ్గుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. గత వారం రోజుల్లో క్వింటాలుకి రూ.3 వేలనుంచి రూ.5 వేల వరకు తగ్గింది. యార్డుకు రోజుకు సగటున 40 నుంచి 50 వేల టిక్కిలు వస్తున్నాయి. గత నెల 10వ తేదీనుంచి ఈనెల 2వ తేదీ వరకు రాయలసీమ జిల్లాల నుంచి సరుకు రాగా గతనాలుగు రోజులుగా పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా సరుకు రావడం ప్రారంభం అయింది. సరుకు ఎక్కువగా వస్తుండటంతో వ్యాపారులు ధరలను క్రమంగా తగ్గిస్తున్నారు. గతశుక్రవారం క్వింటాలుకు రూ.3వేలు కనిష్టంగా తగ్గగా గరిష్టంగా రూ.5 వేలు తగ్గింది. ఎగుమతి అవకాశాలు తగ్గడం, పెద్దఎత్తున సరుకు వస్తుండటంతో వ్యాపారులు ధరలను తగ్గించి వేస్తున్నారు. కొంత మంది రైతులను గ్రామాల్లోనే విక్రయించేలా వత్తిడి తెచ్చేందుకు యార్డులోనే ధరలు తగ్గాయన్న భావన కల్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొంత మందివ్యాపారులు పల్నాడు జిల్లాలో ఇప్పటికే రైతుల కల్లాల్లోనే కొనుగోలు ప్రారంభించారు. అలాగే యార్డులో ఎక్కువ మంది రైతుల వద్ద తేమ శాతం అధికంగా ఉందని కూడా ధర కొంత తగ్గిస్తున్నారు. ప్రస్తుతం ఎండతీవ్రత ఎక్కువగా లేకపోవడం వల్ల మిర్చి ఆరబెట్టుకునేందుకు ఎక్కువ రోజులు సమయంకేటాయించాల్సి వస్తోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అయినకాడికి అమ్ముకుంటున్నారు. గుంటూరుకు సమీప ప్రాంతాల వారు మాత్రం ఒకటి రోజులు ఆరబెట్టుకుని యార్డులోనే నిద్రించి సరుకు అమ్మిన తరువాత స్వస్థలాలకు వెళ్తున్నారు.

గత ఏడాది ఇదే రోజుల్లో మిర్చి ధరలు గరిష్టంగా రూ.27 వేల నుంచి రూ.30 వేలవరకు పలికిన మిర్చి ప్రస్తుతం ఈ ఏడాది జనవరి ప్రారంభం అయిన తరువాత మేలురకం తేజ,బాడిగ రకాలు కనిష్టంగా రూ.9 వేలు ఉండగా గరిష్టంగా రూ.23 వేలు పలికాయి. 333, నెంబరు 5, 273, 341 తదితర రకాలు ధరలు కనిష్టంగా రూ.9500 పలకగా గరిష్టంగా రూ.21వేలు మాత్రమేపలికాయి. గత నెల రోజుల కాలంలో సరుకు ఎక్కువ వచ్చిన రోజున ధరలు తగ్గించడం, సరుకు తక్కువగా వచ్చిన రోజు సగటు ధర స్వల్పంగా పెంచడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు ఈ పరిస్థితి అత్యంత ఇబ్బంది కరంగా మారింది. గతనెల వరకు రూ.20 వేల పలికిన సీజంట బాడిగ రకం గత మూడు రోజులుగా రూ.15వేల నుంచి రూ.18వేల మధ్య పలుకుతోంది. తేజ వెరయిటీ రూ.25వేల నుంచి రూ.23 వేలకు తగ్గింది. 355 బాడిగ రకం రూ.24 వేల నుంచి రూ.2 వేలు తగ్గి రూ.22 వేల పలుకుతోంది. తేజ మీడియం రూ.20 వేల నుంచి రూ.17 వేలకు, ఆర్మూర్ రకం రూ.19 వేల నుంచి రూ.17 వేలకు తగ్గింది. నాన్ ఎసి కామన్ వెరయిటీల్లో 334 కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ.23 వేలు పలికింది.కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు కనిష్ట ధర రూ.11 వేలు, గరిష్ట సగటు ధర రూ.20వేలు వచ్చింది. మేలురకాలు కనిష్ట ధర రూ. 10,500, రూ.21,500 ధర వచ్చాయి. గత వారం రోజులుగా తగ్గుదల కొనసాగుతోంది.



గుంటూరు సమ్మె శిబిరంలో కార్మికులు

కార్మికులకు వేతనాలు పెంచాల్సిందే..

13వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

వేతనాల పెంచాల్సిందేనని, అలాగే ఇతర డిమాండ్లపై మంత్రుల బృందం చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలకు అమలుకు తగిన చర్యలు తీసుకునే వరకూ సమ్మె కొనసాగుతుందని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల 13వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తుంటే జీతాలు పెంచటం కుదరదని మంత్రుల బృందం చెప్పటం సరికాదన్నారు. ఇచ్చిన హామీలు ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టత లేదన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని, సమ్మె కాలం జీతాలు ఇవ్వాలని, సమ్మె సందర్భంగా పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శౌరమ్మ, సామ్రాజ్యం, పి.శ్రీనివాసరావు, పి.పూర్ణచంద్రరావు, కె.మరియదాసు, కాటమరాజు, జి.ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు, షరీఫ్, జానీ, పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమ్మె శిబిరంలో సామూహిక ప్రార్థనలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎస్మాపై కార్మిక సంఘాల ఆగ్రహం

నేడు, రేపు ఆందోళనలకు పిలుపు

2లో

భారీగా సిఐల బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు రేంజి పరిధిలో పలువురు సిఐలను బదిలీ చేస్తూ ఐజి పాల్‌రాజ్ ఆది వారం ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలూ రిపేట రూరల్‌లో ఉన్న బి.అశోక్ కుమార్‌ను నెల్లూరు ఒన్ టౌన్‌కు, ఒంగోలు రూరల్‌లో ఉన్న బి.శ్రీనివాసరెడ్డిని నాయుడుపేటకు, అక్కడున్న కె.నరసింహా రావును సంతమా గులూరుకు, అక్కడున్న బి.ప్రభాకర్‌ను రేంజి విఆర్‌కు బదిలీ పంపారు. రేంజి విఆర్‌లో ఉన్న డి.జగన్ మోహన్‌రావును నాయుడు పేటకు, నాయుడుపేటలోని వై.వీరసోమ య్యను గుంటూరు రేంజి విఆర్‌కు, పొన్నూ రు టౌన్‌లో ఉన్న ఖాజాహుస్సేన్‌ను నెల్లూరు 4వ టౌన్‌కు, అక్కడున్న బి.వి.వి సుబ్బారావును రేంజి విఆర్‌కు, తిరుపతి కమాండ్ కంట్రోలు సెంటర్ సి.కృష్ణారెడ్డిని నర్సరావుపేట వన్‌టౌన్‌కు, అక్కడున్న ఎ.అశోక్ కుమార్‌ను పల్నాడు జిల్లా డిసిఆర్ బికి, నర్సరావుపేట ట్రాఫిక్ సిఐ యు.శోభన్ బాబును పల్నాడు జిల్లా జిల్లా శిక్షణా కేంద్రానికి, ఇక్కడున్న టి.విజయ్‌కృష్ణను రేంజి విఆర్‌కు పంపారు. వీరంతా తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుర్రాలతో పోరాడిన వారు ఎస్మాకు భయపడతారా?

- ప్రభుత్వ తీరుపై వివిధ పార్టీలు, నాయకుల ఆగ్రహం
- జీవో ప్రతులు దహనం - 28వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గుర్రాలను ఎదిరించి పోరాడిన అంగన్వాడీలు ఎస్మా చట్ట ప్రయోగానికి భయపడతారని ప్రభుత్వం ఎలా అనుకుందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. సమ్మెలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్క్ ధర్నా చౌక్ వద్ద సమ్మె శిబిరం వద్ద ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ విడుదల చేసిన జీవో 2 ప్రతులను అంగన్వాడీలు, యూనియన్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్మా చట్టం అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందని, అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని సమ్మె చేస్తుంటే వారిపై ఎస్మా చట్టం ప్రయోగించడం ఎలా చెల్లుబాటవుతుందని ప్రశ్నించారు. అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులని పరోక్షంగా ప్రభుత్వం ఒప్పుకున్నట్లేనని అన్నారు. సమ్మె ప్రారంభమైన వారం రోజుల్లోపు ఎస్మా చట్టాన్ని ప్రయోగించాల్సి ఉంటుదని, 2లో



నరసరావుపేటలో



తెనాలిలో

భర్త, అత్తమామలు కలిసి హత్య

ప్రజాశక్తి - కారంపూడి

భర్త, అతని తల్లిదండ్రులు కలిసి మహిళను హతమార్చిన ఘటన మండల కేంద్రమైన కారంపూడిలో ఆదివారం వెలుగు చూసింది.. పోలీసుల వివరాల ప్రకారం.. కారంపూడిలోని సుగాలి కాలనీకి చెందిన రామావత్ చిన్న బర్మానాయక్‌కు, బొల్లాపల్లి మండలం హనుమాపురానికి చెందిన దేవిబాయ్‌తో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి 2లో

నేటినుంచి సాగర్ కాల్వలకు నీరు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నాగార్జున సాగర్ కుడికాల్వకు సోమవారం నుంచి నీరు విడుదల చేయనున్నట్లు మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తాగు నీటి అవ సరాల నిమిత్తం చెరువులకు నీటి విడుదల చేస్తున్నామని చెప్పారు. గుంటూరులోని తన నివాసంలో ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ 5 టిఎంసిల విడుదలకు కృష్ణా యాజమాన్య బోర్డు అంగీక రించిందన్నారు. 11 రోజుల పాటు నీటిని విడు దల చేస్తామని, తాగునీటి అవసరాల కోసం చెరువులను నింపుకోవాలని సూచించారు. ఈ నెల 8 నుంచి 18 వరకు దశల వారీగా నీటి విడుదల ఉంటుందని మంత్రి చెప్పారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం.చిన ఏసోబు

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి - మాచర్ల

ఎంతోమంది పేద విద్యార్థులు పుస్తకాలు కొనుక్కునే స్తోమత లేక అవకాశాలు కోల్పోతున్నారని, వారికి ఈ గ్రంథాలయాలు ఉపయోగపడాలనే ఉద్దేశంతో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎం.చినఏసోబు అన్నారు. ఈ మేరకు రూ.10 వేలతో సమకూర్చిన పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఆయన స్థానిక శాఖ గ్రంథాలయానికి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాల లాంటివని, అందుబాటులో ఉన్న పుస్తకాలను చదువుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.పుల్లారావు ఉపాధ్యాయ సంఘం నాయకులు కిరీట్‌రెడ్డి, గ్రంథాలయ అధికారి ఫణిభూషణ్, సంగీత విద్వాంసులు లాలూ సాహెబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి-నరసరావుపేట

విజయవాడలో ఈ నెల 19న జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎ-1 కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం వైసిపి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశానికి వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున పిడబ్ల్యూడి గ్రౌండ్‌లో రూ.404 కోట్లతో ఏర్పాటు చేసిన 125 అడుగుల ఎత్తు విగ్రహాన్ని సిఎం ఆవిష్కరిస్తారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, వైసిపి శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

ముదిరాజు కళ్యాణ మండపానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక సాగర్ రోడ్ లోని గొర్రెల మండి సమీపంలో ముదిరాజ్ కళ్యాణ మండపానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా వీలైనంత సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రూ.20 లక్షలతో 15 సెంట్లలో కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.చిన్న ఏసోబు, వైసిపి నాయకులు శ్రీనివాస్‌శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ టి.కిషోర్, రఘురాంరెడ్డి, జెడ్‌పిటిసి మల్లు స్వామి, ముదిరాజ్ సంఘం నాయకులు టి.వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బకాయిల కోసం 36 గంటల ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, పీఆర్సీ, డిఎలు, పిఎఫ్ ఏపీ జిఎల్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధన కోసం యుటిఎఫ్ చేస్తున్న దశల వారి పోరుబాటలో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడ ధర్నా చౌక్‌లో 36 గంటల ధర్నా చేపట్టినట్లు యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి తెలిపారు. ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రతినెలా 1వ తేదీన వేతనం, మెరుగైన పీఆర్సీ, సకాలంలో డిఎలతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులతో స్నేహ వాతావరణం వంటి హామీలు జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చారని, అయితే వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 17వ తేదీ వరకూ జీతాలు, పెన్షన్లు రాకపోవడంతో బ్యాంకుల్లో అప్పులకు జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యలపై చర్చించే అవకాశమూ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పీఆర్సీ అరియర్లు రూ.6246 కోట్లు, పీఆర్సీ ముందు డిఎలు రూ.1136 కోట్లు, పీఆర్సీ తర్వాత ప్రకటించిన డిఎలు రూ.4884 కోట్లు, పిఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్ పేమెంట్లు రూ.వెయ్యి కోట్లు, ఎపిజిఎల్ఐ లోన్లు సరెండర్ లీవులు ఇతర అరియర్లు, మొత్తం రూ.18096 కోట్లు బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు.

భర్త, అత్తమామలు కలిసి హత్య

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరికీ తరచూ వివాదాలు వస్తున్నాయి. పెద్దల సమక్షంలోనూ పలుమార్లు పంచాయితీలు పెట్టారు. పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యాభర్తలతో పాటు బర్మా నాయక్ తల్లిదండ్రులు కూడా పొలంలోని మిర్చి పంట వద్దకు కాపలా కోసం వెళ్లారు. కొద్దిసేపటికి దంపతులిద్దరికి మళ్లీ గొండవ మొదలైంది. దీంతో బర్మా నాయక్ తన తల్లిదండ్రులైన శామిని భాయి, లాలు నాయక్ సహాయంతో దేవిభాయ్‌ని నీటిలో ముంచి ముంచి ఊపిరాడకుండా చేయడం ద్వారా హతమార్చాడు. ఆదివారం ఉదయాన్నే అటుగా వెళ్లిన వారికి పొలాల్లో దేవిబాయ్ మృతదేహం కనిపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. నిందితులు పోలీసుల అదుపులో ఉండగా కేసును సిఐ డి.జయకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రాలతో పోరాడిన వారు ఎస్మాకు భయపడతారా?

(మొదటి పేజీ తరువాయి)

అయితే 26వ రోజుల తర్వాత జీవోనిచ్చారని అన్నారు. తాళాలు పగలగొట్టిన అంగన్వాడీ సెంటర్లకు రక్షణ కొరబడిందని మంత్రి బొత్స సత్యనారాయణ అంటున్నారని, ఆయనేం మాట్లాడతారో ఆయనకే అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి మసులుకోవాల్సిన ప్రభుత్వం అధికారులను ప్రజా ప్రతినిధులను అడ్డం పెట్టుకొని బెదిరింపులకు దిగటం తగదన్నారు. ఇందిరా గాంధీ హయాంలో రైల్వే ఉద్యోగులు సమ్మె చేస్తే ఎస్మా ప్రయోగించారని, అనంతరం వచ్చిన ఎన్నికల్లో ఘోర పరాజయంపాలయ్యారని గుర్తు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారానికి టిడిపి కట్టుబడి ఉందని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, పిడిఎం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ అంగన్వాడీలు మహిళలే కదా? అని ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, అధికారులు, పోలీసులను అడ్డు పెట్టుకుని సమ్మెను అణచాలనుకుంటోందని విమర్శించారు. అంగన్వాడీలకు అన్ని రాజకీయ పార్టీలు, లబ్ధిదారులు, ప్రజలు మద్దతు నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నరసరావుపేట మండల అధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డా దేవి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎన్.రామారావు, వి.సింహాద్రి యాదవ్, కె.రాంబాబు, వి.వెంకట్, యు.రంగయ్య, హెల్డా ఫ్లోరెన్స్, శోభారాణి, నిర్మల, మాధవి, కవిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పెంచిన పింఛన్ల పంపిణీ

పెంచిన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి

పెంచిన పింఛన్ల పంపిణీని మండలంలోని ధరణికోటలో ఆదివారం పంపిణీ చేయగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒకలా, తర్వాత మరోలా తాము మాట్లాడడం లేదని, హామీలన్నీ అమలు చేస్తున్నామని చెప్పారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధిని విస్మరించగా తాము అభివృద్ధి చేశామని చెప్పారు. అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డ, అమరావతి - తుళ్లూరు డబుల్ లేన్ రోడ్డు, మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మిస్తున్నామని, బ్రిడ్జి నిర్మాణంతో అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. 2019లో ధరణికోటలో 694 మందికి రూ.13.88 లక్షలు పెన్షన్ రాగా ఇప్పుడు 1185 మందికి ప్రతి నెలా 35.55 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు వేశామన్నారు. అనంతరం గుండె ఆపరేషన్ చేసుకున్న వాలంటరీ ఆరుముళ్ల రత్నకుమారి తండ్రి సంసోనును ఎమ్మెల్యే పరామర్శించారు. నాయకులు కె.కోటేశ్వరరావు, సర్పంచ్ ఎం.పావని రాంబాబు, ఎంపిటిసి కె.శాంతమ్మ మత్తయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతాజి

ఎస్మాపై కార్మిక సంఘాల ఆగ్రహం

నేడు, రేపు ఆందోళనకు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించటాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిచాయి. ఈ మేరకు ఆదివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అంగన్‌వాడీలపై ఎస్మా ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని నిర్ణయించాయి. పల్నాడు జిల్లా కేంద్ర నరసరావుపేటలోని సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలతోపాటు వివిధ పార్టీల నాయకులు జీవో ప్రతులను దహనం చేశారు. గుంటూరులో సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన వహించగా.. సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ఎస్మా ఉత్తర్వుల కాపీలు దహనం చేయాలని, 9వ తేదీన గుంటూరులో మార్కెట్ సెంటర్ నుండి శంకర్ విలాస్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ 26 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం అకస్మాత్తుగా ఎస్మా ప్రయోగించడం అంటే కార్మిక పోరాటాలను నీరుకార్చేచేందుకేనని అన్నారు. ఇటువంటి చట్టాల ద్వారా పోరాటాలను అణచలేదని గుర్తు చేశారు. గతంలో ఆర్టీసీ కార్మికుల మీద, ప్రభుత్వ ఉద్యోగుల మీద ప్రయోగించినా ఐక్య పోరాటాలతో తిప్పి కొట్టారని గుర్తు చేశారు. ఎస్మా చట్టం ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ తిరిగి అధికారంలోకి రాలేదన్నారు. అంగన్వాడీలను కార్మికులుగా కానీ, ఉద్యోగులుగా కానీ గుర్తించని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అత్యవసర సర్వీసులోకి చేర్చడం శోచనీయమన్నారు. ఎస్మా చట్ట ప్రయోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మిక సంఘాలు భాగస్వాములు కావాలని, ప్రభుత్వ చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి హనుమంతరావు, ఐఎఫ్‌టియు నాయకులు గణేష్, ఎఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, టిఎన్‌టియుసి జిల్లా సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు, జోషి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రసంగించారు.



డ్రోన్ల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - బెల్లంకొండ

వికసిత్ భారత్‌తో భాగంగా బెల్లంకొండ, న్యూ చిట్యాలలో ఆదివారం పురుగు మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బాణావత్ నరసింహ నాయక్, భూక్యా నరసింహ నాయక్, దరియావలి, ఎంపిడిఒ వెంకటరెడ్డి, వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాలుగొన్నారు.

నేటి జగనన్నకు చెబుదాం రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ఎన్నికల సంఘం పర్యటన దృష్ట్యా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వంహించాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన)ను రద్దు చేసినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరారు.

జిజిహెచ్ అభివృద్ధికి కృషి

కేన్సర్ సెంటర్‌కు రూ.20 కోట్లతో సిటీస్కాన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల తెలిపారు. జిజిహెచ్ కేన్సర్ సెంటర్‌ను గ్రేడ్ వన్ లెవల్‌కు పెంచామని తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాలలో జంఖానా ఆడిటోరియంలో ఆదివారం ప్రభుత్వ వైద్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌కు రూ.20 కోట్ల సీటీ స్కాన్ ఇచ్చామని చెప్పారు. సీటీస్కాన్ పరికరం కొనుగోలుకు రూ. 4 కోట్లు ఇచ్చామని, సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.7.5 కోట్లు ఇచ్చామని వివరించారు. ప్రభుత్వ వైద్యుల యూనియన్ నాయకులు, జూనియర్ డాక్టర్స్ యూనియన్ నాయకులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. వైద్యుల సమస్యలపై మంత్రి రజని వెంటనే స్పందించి ఎరియర్స్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, టైమ్‌బాండ్ ప్రమోషన్స్ ఇచ్చేందుకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. పీజీ వైద్యులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు విషయంలో మినహాయింపు ఇస్తామని, మహాప్రస్థానం వాహనాలు అదనంగా ఏర్పాటు చేస్తామని, జీజీహెచ్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు. తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే వైద్య ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటున్నాయని, పేదలు వాటిని భరించలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వ వైద్యులు తాము చేసే వైద్యసేవలతో దేవుళ్లుగా పూజింపబడతారని, వైద్యసేవలతో పేదల హృదయాలు గెలవాలని సూచించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రతి పేద వాని ఇంటికే వైద్యం తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఏ ప్రభుత్వం ఎన్నడూ ఖర్చుచేయని విధంగా సీఎం జగన్ వైద్య రంగానికి వేలకోట్లు ఖర్చుపెట్టి ప్రతి పేదకు ఉచితంగా ఆరోగ్యం అందిస్తున్నారని కొనియాడారు.డైరక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇండియాలో అత్యధికంగా స్పెషలిస్ట్ వైద్యులను కలిగిన ఉన్న రాష్ట్రం ఏపీ అని తెలిపారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో 61శాతం వైద్యుల ఖాళీలు ఉంటే ఏపీలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ఒక్క ఖాళీ కూడా లేకుండా అన్ని పోస్టులు భర్తీ చేయటం వల్లే నాణ్యమైన వైద్యసేవలు ఏపీ ప్రజలకు అందుతున్నాయన్నారు. కోవిడ్‌లో ఏపీ వైద్యరంగం చేసిన సేవలు అందరికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ సూర్యశ్రీ, డైరక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకె రెడ్డి, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ రమేష్, గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్వి రమణ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ వెనిగళ్ల బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. జూనియర్స్ డాక్టర్స్ అసోసియేషన్, ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు మంత్రి విడదల రజనిని ఘనంగా సన్మానించారు.



మంత్రి రజినీని సన్మానిస్తున్న వైద్యులు

12 నాటికి టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు

టిడ్కో ఎస్ఇ చిన్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ వేగంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 12 నాటికి పూర్తి స్థాయిలో అందరికీ పట్టాలు అందిస్తామని టిడ్కో ఎస్.ఈ. చిన్న కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయంలో 10 బ్లాక్‌ల్లో లబ్ధిదారులకు పట్టాలు, ప్లాట్ తాళాలు అందిచారు. గుంటూరు అర్బన్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాలను లబ్ధిదారులకు పట్టాలను రోజువారీ షెడ్యుల్ మేరకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అడవితక్కెళ్లపాదులోని 101 బ్లాక్‌లకు సంబందించి 300 చదరపు అడుగుల ప్లాట్‌లు ఆదివారం 10 బ్లాక్‌ల లబ్ధిదారులకు పట్టాలు అందించామని, ఈనెల 12 నాటికి పట్టాల పంపిణీ పూర్తి అవుతుందన్నారు. మంగళవారం నుండి 365, 425 చదరపు అడుగుల ప్లాట్‌లను బ్లాక్‌ల వారీగా అప్పగిస్తామని చెప్పారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు తగిన వివరాలతో విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంటే వేగంగా ఇవ్వడానికి ఆ శాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. టిడ్కో ఇళ్లు మంజూరై, పట్టా రాని వారు అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గహ సముదాయంలో జిఎంసి, టిడ్కో అధికారులు అందుబాటులో ఉంటారని, వారిని కలిసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఈ.ఈ. ప్రసాద్, జిఎంసి మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు, వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్య, వైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో పేదలకు పెన్షన్లు, నూతన వస్త్రాలు అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గుడిపాటి వెంకట భాస్కరరావు పాల్గొని 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్, రూ.1లక్ష విలువ చేసే నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవోపా సేవలను భాస్కరరావు కొనియాడారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎస్ఎన్‌డి మల్లేశ్వరావు, సిఎ పొట్టి నరేంద్ర, తుమ్మలపల్లి చంద్ర భాస్కరరావు, అవోపా రాష్ట్ర అధ్యక్షులు టి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, జనార్ధనరావు, యం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పెన్షన్లు, వస్త్రాలు అందచేస్తున్న వెంకట భాస్కరరావు, తదితరులు


ఏసురత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఏసురత్నం

ప్రజాశక్తి తెనాలి

దళిత ఉద్యమాలతో అణగారిన వర్గాలకు అండ గా నిరిచిన కనపర్తి ఏసురత్నం చిరస్మరణీయుడని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. ఇటీవల మృతి చెందిన కనపర్తి ఏసురత్నం సంస్మరణ సభ స్థానిక కవిరాజ పార్కులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియోషన్ హాల్లో భిన్నస్వరాలు సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. 'ఏసురత్నం జ్ఞాపకాలతో ఓసాయంత్రం' శీర్షికన నిర్వహించిన సభకు కనపర్తి బెన్ హర్ అధ్యక్షత వహించారు. సభలో ప్రొఫెసర్ స్వరూప రాణి తో పాటు హేతువాది లక్ష్మి, సిపిఐ నాయకులు బొల్లిముంత కష్ణ, సిపిఎం ఏరియా కార్యదర్శి కె బాబు ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో జి. సురేష్ బాబు, అబ్రహాం, ప్రసాద్, సమత, బీంరెడ్డి శేషు, లాజరు, ప్రొఫసర్ అబ్రహాం లింకన్, డేవిడ్, బి.కష్ణమోహన్, ఉమ, డాక్టర్ పిల్లి వాసు, ఏసురత్నం చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. భిన్న స్వరాలు సంస్థ ఆర్గనైజర్స్ జుగాష్ వలీ, జి.యస్. నాగేశ్వర రావు, నండూరి నారాయణ తదితరులు పర్యవేక్షించారు.

తెనాలి వన్‌టౌన్ సిఐ బదిలీ

ప్రజాశక్తి తెనాలి :పట్టణ వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కొమ్మాలపాటి చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. రేంజ్ ఐజి జి.పాల్ రాజ్ ఆదివారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పలువురు సిఐలు బదిలీ అయ్యారు. ఈ ప్రక్రియలో భాగంగా వన్ టౌన్ సీఐ చంద్రశేఖర్ గుంటూరు విఆర్ కు వెళ్ళగా, విఆర్ నుంచి తెనాలి వన్ టౌన్ సిఐ గా దశరథరామయ్య నియమితులయ్యారు.

నేటి నుంచి ఆలపాటి ప్రజాయాత్ర

ప్రజాశక్తి తెనాలి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం నుంచి నియోజకవర్గంలో ప్రజాయాత్ర చేపట్టనున్నారు. తొలి రోజున సంగం జాగర్లమూడి, చావా వారి పాలెం, అంగలకుదురులో ప్రజా యాత్ర సాగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా యాత్రలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తెనాలి రూరల్ :వాళ్లంతా కలసి 1978-81 సంవత్సరంలో బికాం విద్యను కలసి చదువుకున్నారు. 42 ఏళ్ల తర్వాత స్థానిక విఎస్ఆర్ కళాశాల డాక్టర్ చిట్టెమ్మ సుబ్బారెడ్డి కళామందిరంలో ఆత్మీయ సమ్మేళనమయ్యారు. ఆదివారం ఏర్పాటుచేసిన ఆత్మీయ కలయికలో పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తుళ్లూరు శ్రీనివాసరావు, పి సత్యన్నారాయణ గుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు కన్నెగంటి శివరామప్రసాద్, జయప్రకాష్, ప్రతాప్ రెడ్డి, రుక్మిణి తదితరులు తెలిపారు. ముఖ్యంగా ఆచార్యులు నన్నపనేని ముకుందరావు, కె పిచ్చియ్య, అల్లం సత్యన్నారాయణ, బి జానకి రామయ్య, ఎ శివప్రసాద్, కె దుర్గాప్రసాద్ తదితరులు తమ జ్ఞాపకాలను నెమరవేస్తూ ప్రసంగి ంచారు



ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ప్రజాశక్తి - నాదెండ్ల

కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనం పై నున్న వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంలో నాదెండ్ల మండల పరిధిలోని ఇర్లపాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కనపర్రు నుండి బైక్ మీద చిలకలూరిపేట వస్తున్న వారిని నరసరావుపేట వెళ్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నవారు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో నరసరావుపేట వెళ్తున్న చిలకలూరిపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త మల్లెల రాజేష్ నాయుడు తన కాన్వాయ్ ని ఆపి హుటాహుటిన అంబులెన్సును పిలిపించారు. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి స్వయంగా దగ్గరుండి పంపించి హాస్పిటల్ వైద్యులకు ఫోన్ చేసి క్షతగాత్రులకు వెంటనే అవసరమైన చికిత్సను అందించాలని ఆదేశిం చారు.

పురుగుమందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి - మాచర్ల :స్థానిక రాయవరం జంక్షన్‌లో పురుగుమందు తాగి ఆదివారం తెల్లవారు జామున వ్యవసాయ కూలీగా పని చేసే చెప్పాల వెంకటేశ్వర్లు 30 పురుగు మందు తాగి మరణించాడు స్థానికుల సమాచారం మేరకు రూరల్ పోలీసులు మతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. గురజాల నియోజకవర్గం చర్లగుడిపాడు ు చెందిన చెప్పాల వెంకటేశ్వర్లు అత్తగారు ఊరైన ఆత్మకూరు గ్రామానికి వచ్చి రెండేళ్ల మంచి నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం భార్యతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయిన వెంకటేశ్వర్లు ఆదివారం పురుగుమందు తాగి మృతి చెంది కనిపించాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ :అంక్రమంగా మద్యం బాటిల్స్ తీసుకెళుతున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 24 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెదకూరపాడు మండలం లకగడపాడుకు చెందిన కొమ్మినేని నరేంద్ర నాథ్ గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. ఫణిదం నుండి మద్యం బాటిల్స్ తీసుకెళుతుండగా రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాగరాజుపై బిసి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి : ఇటీవల బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇంధనం నాగరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం బీసీ సంక్షేమ సంఘం మంగళగిరి నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ ఆధ్వర్యంలో తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇంధనం నాగరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తాడేపల్లి పట్టణ అధ్యక్షులు మైలా రవేంద్ర, వల్లెం హనుమకొండ, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి నల్ల బోతుల సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు నల్లబోతుల లక్ష్మయ్య, రూరల్ యువజన అధ్యక్షులు చొప్పవరపు గోపి, మంగళగిరి మండల రూరల్ అధ్యక్షులు ఆలా సాంబయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

బెల్టుషాపు నిర్వాహకునిపై కేసు

ప్రజాశక్తి- తెనాలి :బెల్ట్ షాప్ నిర్వహిస్తూ, అనధికారికంగా మద్యం నిల్వలు కలిగిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాల ప్రకారం గుడివాడలో గ్రామానికి చెందిన పెరికల వెంకటరత్నం బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదివారం దాడి చేశారు. రెడ్ హ్యాండెడ్‌గా అతనిని పట్టుకొని అతని నుంచి ఐదు క్వార్టర్ల మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

పలు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం చెంచుకాలనీ, పెద్దఅనుపు న్యూచెంచుకాలనీ, బోధనంపాడు గ్రామాల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం పర్యటించారు. ఓటు హక్కుపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరి సరిగా ఓటు హక్కును వినియోగించుకుకోవాలని చెప్పారు. గ్రామాల్లో చెంచులకు అందుతున్న మౌలిక సదుపాయలను తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ జివి రమణా కాంత్‌రెడ్డి, తహశీల్దార్ హుస్సేన్, డిఎల్‌డిఒ గ్రుబూనాయక్, ఎంపిడిఒ సరోజినీదేవి, జెడ్‌పిటిసి మల్లు స్వామి, నాగులవరం విఆర్‌ఒ అంజి, బిఎల్‌ఒ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఎ.ముప్పాళ్లలో ఈనెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు 32వ రైతు మిత్ర జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతుమిత్ర కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు ఆదివారం తెలిపారు. నాకౌట్ కం లీగ్ విధానంలో డే అండ్ నైట్ పోటీలు జరుగుతాయన్నారు. మొదటి బహుమతి రూ.2.50 లక్షలు, రెండవ బహుమతి రూ.1.50 లక్షలు, మూడవ బహుమతి రూ.లక్షతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సదుపాయ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న రాజేష్‌నాయుడు

సమస్యలన్నీ తెలుసు.. పరిష్కరిస్తా..

ప్రజాశక్తి - యడ్లపాడు

పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీని ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది కొత్త సంవత్సరం నుంచే రాష్ట్రంలో పింఛన్ల పండుగ మొదలైందన్నారు. జగనన్న నాయకత్వంలో చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజానీకానికి సేవ చేసే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో సమస్యలన్నీ తనకు తెలుసని, అన్నిటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 8,282 మందికి నెలనెలా పెన్షన్‌లు పంపిణీ చేస్తుండగా కొత్త పెన్షన్‌లు ఈనెలలో 287 మంజూరయ్యాయని తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మొత్తం 37,980మంది పెన్షన్ అందుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్, జడ్పీటీసీ ముక్తా వాసు, వైసీపీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్, యడ్లపాడు సొసైటీ ఛైర్మన్ బశల శివరామకృష్ణ, సీనియర్ నాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, మానుకొండ విజయభాస్కరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, మండల సేవాదళ్ అధ్యక్షులు కల్లూరి విజయకుమార్, మానుకొండ వీరారెడ్డి పాల్గొన్నారు.

చొక్కా పట్టుకు నిలదీయాలన్న మాటను సిఎం గుర్తు తెచ్చుకోవాలి



ప్రజాశక్తి-సత్తెనపల్లి

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 28వ రోజుకు చేరింది. స్థానిక తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అంగన్వాడీలంతా మోకాళ్లపై నిలబడి కళ్లు మూసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్ మద్దతు తెలిపారు. యూనియన్ సత్తెనపల్లి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జి.సుజాత, ఎం.అహల్య, సెక్టర్ లీడర్లు చాముండేశ్వరి, ధనలక్ష్మి, జ్యోతి, అంజలి అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక సురేష్ మహల్ వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్మా చట్టం, అది ఎవరికి వర్తిస్తుంది అనే విషయాలపై వివరించారు. యూనియన్ నాయకులు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ 27 రోజులుగా సమ్మె చేస్తుండే సరైన రీతిలో స్పందించని ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరామకృష్ణ, ఆంజనేయులు, శారమ్మ, ఉమాశంకరి, నాగజ్యోతి, పద్మ, కృష్ణకుమారి, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


28వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె



వినుకొండ శిబిరంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నాయకులు సైదమ్మ, శాంతలత, శివకుమారి, చిలకమ్మ, రుక్మిణి, శివపార్వతి, కుమారి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక గ్రంథాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా పలువురు అంగన్వాడీలు దీక్షల్లో కూర్చున్నారు. వీరికి మద్దతుగా సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వాగ్దానాలను విస్మరించిన నాయకులను చొక్కా పట్టుకుని నిలదీయాలని గతంలో అంగన్వాడీల ఆందోళనల వద్దకు వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని, ఈ విషయాన్ని ఆయనోసారి గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. యూనియన్ సెక్టార్ అధ్యక్షులు జి.సావిత్రి మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. నాయకులతో చర్చించాలని, కనీస వేతనం అమలతోపాటు గ్రాడ్యుటి ఇవ్వాలని కోరారు.

బాధలను విస్మరించి బెదిరింపులు

ప్రభుత్వ తీరుపై మున్సిపల్ కార్మికుల ఆగ్రహం - 13వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - నరసరావుపేట

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సమ్మె శిబిరంలో మున్సిపల్ వర్కర్స్ అండర్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా పోటీ కార్మికులను తెచ్చి సమ్మె విచ్ఛిన్నానికి యత్నిస్తోందని మండిపడ్డారు. కార్మికులను పోలీసుల ద్వారా బెదిరించాలని చూస్తున్నారని, కార్మికుల బాధలను విస్మరించారని విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. ఇదే తీరు కొనసాగితే రానున్న ఎన్నికల్లో కార్మికులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శిబిరంలో నాయకులు టి.మల్లయ్య, డి.యోహాను, నవీన్, వి.విజయలక్ష్మి, పి.ఏసు, కె.ప్రసాద్, సాల్మన్, దీనమ్మ, చిన్న అల్లాబక్షు, సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిత్యం పనిచేసే కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం ప్రభుత్వ అలసత్వం పనికి రాదని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 13వ రోజు దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. దీక్షలకు కెసిపి ఫ్యాక్టరీ కార్మికులు మద్దతు తెలిపారు. నాయకులు బి.మహేష్, బి.శ్రీను, పి.వెంకయ్య, డి.వెంకటరమణ, రమణ, అనసూయ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ కార్మికులు సామూహిక ప్రార్ధన చేస్తూ 13వ రోజు సమ్మె శిబిరంలో నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని, కార్మికులు అడిగిన కోరికలను తీర్చడానికి ఇష్టం లేక రకరకాల కారణాలతో ముడిపెడుతూ వాయిదా వేస్తోందని విమర్శించారు. జీతం రూ.రెండు మూడు వేలైనా పెంచాలని లేదా ఒక నేల జీతాన్ని బోనస్‌గా ఇవ్వాలని చర్చలకు వెళ్లిన యూనియన్ నాయకులు ప్రతిపాదించగా ప్రభుత్వం తిరస్కరించిందని చెప్పారు. ఇంజనీరింగ్ కార్మికులు, ఎన్‌ఎంఆర్‌లకు ఇతర కార్మికులకు వేతనాలు పెంచడానికి ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు. సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టర్ ఆఫీసుల వద్ద ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.సీతారామయ్య, ఎ.రామారావు, సురేంద్ర, డి.శ్రీను, వెంకటేశ్వర్లు, పరమేష్, కె.వెంకటమ్మ, లక్ష్మి, షేక్ సుభాని, రమేష్, హుస్సేన్, కుమార్, యూసఫ్, తిరుపతిరావు, బాలకృష్ణ, విజయకుమార్, ఎం.నాగేశ్వరరావు, ఎస్.కె నాగూర్, ఏడుకొండలు, వెంకయ్య పాల్గొన్నారు.







ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద్రకళ, జసత్తెనపల్లి అధ్యక్షులు జి.పెదవెంకయ్య, కార్మికులు కమలమ్మ, సునీత, కోటేశ్వరి, సత్యవతి, ఎస్తేరమ్మ పాల్గొన్నారు.

బెదిరింపు రాజకీయాలకు నిదర్శనమే ఎస్మా ప్రయోగం

టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు



విలేకర్లతో మాట్లాడుతున్న చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం వైసిపి బెదిరింపు రాజకీయాలకు నిదర్శనమని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్మా చట్టాన్ని బెదిరింపు చట్టంగా సిఎం మార్చారని అన్నారు. అంగన్వాడీల డిమాండ్లు న్యాయమైనవని అన్నారు. అంగన్వాడీలది ఎమర్జెన్సీ సర్వీస్ కాదని, అటువంటి వారిపై ఎస్మా చట్టాన్ని ఎలా ప్రయోగిస్తారని నిలదీశారు. ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే కార్మికులతో కలిసి ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. వైసిపి అరాచక పాలనకు సమాధి కట్టేందుకు అంగన్వాడీలు, డ్వాక్రా మహిళలు, రాబోయే రోజుల్లో వాలంటీర్‌లు ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు వి.సింహాద్రి యాదవ్, బి.పేరయ్య, పి.రామిరెడ్డి, సిహెచ్.బాలు, జి.వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, జయరావు మీరావాలి, మాబు పాల్గొన్నారు.



గుజ్జర్లపూడిలో ఆదర్శ వివాహం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పెదకూరపాడు మండలం కనగండ్లకు చెందిన కోరంపల్లి పద్మారావు కుమారుడు డాక్టర్ వెంకటేష్‌కు విశాఖపట్నం అవనిగడ్డ శ్రీనివాసరావు కుమార్తె హనిషతో ఆదివారం సత్తెనపల్లి మండలం గుజ్జర్లపూడిలో ఆదర్శ వివాహం జరిగింది. సంప్రదాయాలకు భిన్నంగా పెద్దల సమక్షంలో వీరిద్దరూ ఒక్కటయ్యారు. పెళ్లిపెద్దగా ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య వ్యవహరించి ప్రమాణ పత్రాలు చదివించారు. కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అధ్యక్షత వహించగా వివాహాలు-హేతుబద్ధత గురించి విశాఖపట్నానికి చెందిన సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.సీతామహాలక్ష్మి వివరించారు.

ఎస్మాపై కొనసాగుతున్న అంగన్వాడీల నిరసనలు



తాడేపల్లి, గుంటూరులో జీవో కాపీలు దహనం


పెదనందిపాడులో


మేడికొండూరులో

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె 27వ రోజుకు చేరుకుంది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరానికి ఆదివారం సైతం అంగన్‌వాడీలు వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెను విచ్చిన్నం చేయటానికి ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జిఒ 2 ఉత్తర్వులను సమ్మె శిబిరం వద్ద దగ్ధం చేశారు. సిఐటియు గుంటూరు తూర్పు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ ప్రసంగించారు. ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మాకు భయబడి వెనక్కి తగ్గేది లేదన్నారు. ఇటువంటి నియంతృత్వ పాలన వల్ల ప్రభుత్వానికే నష్టమని చెప్పారు. ప్రభుత్వం ఎంత నిర్భంధం ప్రయోగిస్తే రానున్న ఎన్నికల్లో అంత పెద్ద గుణపాఠం నేర్చుకుంటుందన్నారు. మహిళలు నా అక్క చెల్లెళ్లు అంటూ చెబుతున్న ప్రభుత్వం గత 27 రోజులుగా అంగన్‌వాడీలు రోడ్లపైకి వచ్చి పోరాడుంటే అణచివేయాలని ప్రయత్నించటం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి సమస్యలు పరిష్కరించి, సమ్మె విరమింప చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగమణి, రమాదేవి, కుమారి, రోజమ్మ, మస్తానీ, పంకజాక్షి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెదకాకాని రూరల్ :పెదకాకాని అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో అంగన్వాడీలు జీవో2 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి, యూనియన్ నాయకులు కనకవల్లి ప్రసన్న ఈ సదర్భంగా ప్రసంగించారు.


పెదకాకానిలో

ప్రజాశక్తి - తాడికొండ :తాడికొండలో అంగన్వాడీ సమ్మె శిబిరం వద్ద ఎస్మా కాపీలను యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, సుబ్బాయమ్మ, కోటేశ్వరమ్మ, శాంతి దహనం చేశారు. ప్రభుత్వం తక్షణం జీవో ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : తుళ్లూరులో సిఐటియు రాజధాని డివిజన్ కమిటి, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మె శిబిరం దగ్గర నుంచి లైబ్రరీ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రభుత్వ నియంతత్వ చర్యలకు, జీవో 2 కువ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జీవో ప్రతులను తగుల బెట్టారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు, నాయకులు పేరంబాబురావు, స్వర్ణలత, రజనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు : ఎస్మా ప్రయోగించి అంగన్వాడీల పోరాటాన్ని ఆపలేరని ఐద్వా జిల్లా కార్యదర్శి గద్దె ఉమశ్రీ తెలిపారు. ఆదివారం మేడికొండూరులో అంగన్వాడీలకు ఆమె మద్దతు తెలిపి ప్రసంగించారు. జీవో2 కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధనలక్ష్మి, పార్వతి, భూలక్ష్మి, రోషన్, నాగలక్ష్మి, రాజమ్మ, షకీలా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం :అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు పి రజని, పద్మ, అనురాధ, రమాదేవి, సీతా రాఘవ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - తెనాలి రూరల్ : స్థానిక విఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరవధిక సమ్మెలో సిఐటియు, సిపిఎం పార్టీలు తమ పూర్తి మద్దతు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమ్మెలో. దీక్ష శిబిరంలో చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు కనకు అంటూ ప్రదర్శన నిర్వహించారు. తమ న్యాయమైన కోర్కెలను మాత్రమే తీర్చమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఎపి అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎవిఎన్ కుమారి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, పి పావని, ఎలిజబెత్, రంగా పుష్ప విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన నిరవధిక సమ్మె శిబిరంలో అంగన్వాడీలు ఎస్మా పై నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరే కంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ, అంగన్వాడి యూనియన్ నాయకులు వినీల, మేరీ రోజమ్మ, భూలక్ష్మి, తిరుపతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ తమ సంఘం తరపున అంగన్వాడీలకు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో అంగన్వాడీల సమ్మె కొనసాగుతంది. కాకుమానులో యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు వాసవి, శశికళ ఆద్వర్యంలో జీవో2 ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లిలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరసనలో భాగంగా ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జిఒ 2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మంగళగిరి ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు, రిట్కైర్డ్ బెనిఫిట్స్, పెన్షన్ మొదలైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ఒంటరిగా లేరని వారికి అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఫాతిమ, సుజాత, మాణిక్యం, శ్రీదేవి, తబిద, కమల, లక్ష్మి, మధు, కిరణ్మయి, శశి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : పొన్నూరులో అంగన్వాడీ సమ్మెకు మద్దతు తెలిపి సిఐటియు నాయకులు నిమ్మకూరు రమేష్‌బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి సుకన్య. డి పద్మజ. ప్రాజెక్ట్ లీడర్ పిడి విజయలక్ష్మి. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు


మంగళగిరిలో


పొన్నూరులో


ఫిరంగిపురంలో


తాడికొండలో


తుళ్లూరులో

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

13వ రోజు కొసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - మంగళగిరి :మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వివి జవహర్లాల్ మాట్లాడుతూ పట్టణాల్లో చెత్త కుప్పల పెరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, యూనియన్ నాయకులు పి పూర్ణ, కేసు, వై శివ నాగేశ్వరావు, కె. నాగేశ్వరమ్మ, ఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి :తెనాలి పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో కార్మికులు వంటి కాలిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని, విధి లేని పరిస్థితిలో సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, కార్మికులకు ఇఎస్ఐ డిస్పెన్సరీ అందుబాటులోకి తేవాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి నాయకులు ఎం పద్మ, ఎం నాగరాజు, జయప్రద, వి సుధాకర్, పి భాస్కర్, నాగేంద్రబాబు, శ్రీనివాసరెడ్డి, సుభద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య పిలుపు నిచ్చారు. మండలంలోని కాజా గ్రామంలో పారిశుధ్య కార్మికుల తో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎంటిఎంసి విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులకు కూడా సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్ఐ నాయకులు బాలాజీ యూనియన్ నాయకులు నరసింహారావులు తమ మద్దతు తెలియజేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :మున్సిపల్ కార్మికు లు కోరుతున్న న్యాయమైన కోరికలను ప్రభుత్వం బేషరత్తుగా అంగీకరించి జీవోలు విడుదల చేయాలని రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. రాజధాని గ్రామమైన ఎర్రబాలెంలో కార్మికులు కుటుంబీకులతో కలిసి నిరసన తెలిపారు. రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై ఏ అధికారి అయినా, సూపర్వైజర్లైన కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రవి హెచ్చరించారు. సిపిఎం నాయకులు ఎస్ రామరాజు మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేసి మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయడం వలన పారిశుధ్యం కుంటుపడుతుందని, ప్రజారోగ్యాలు దెబ్బతింటాయని అన్నారు. సమ్మె వల్ల ఏపీ అనారోగ్య ఆంధ్రప్రదేశ్ గా మారకముందే మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం బెదిరింపులకు భయపడకుండా సిఐటియు ఎర్రజెండా అండతో కార్మికులు సంఘటితమై తమ హక్కులను సాధించుకోవాలని రామరాజు కోరారు సిపిఎం నాయకులు అత్తలూరి వీర వెంకయ్య, ఎల్ రాధిక మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి బాబు ఓ రామారావు, టి.ఆదిలక్ష్మి, కె.కోటేశ్వరి, ఎన్.దివ్య, ఎం.పార్వతి, కె.లక్ష్మణ్, శివకుమారి, రమణమ్మ, రోశయ్య నాయకత్వం వహించారు.


మంగళగిరిలో


కాజలో


తెనాలిలో


ఎర్రబాలెంలో

విజేతలుగా జవహర్ నవోదయ, వివేకానంద టెక్నో

జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం

ఫిబ్రవరి 10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను స్థానిక సాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతి మండలానికి ఒక ప్రభుత్వ పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాల నుండి విద్యార్థులను ఎంపిక చేయగా 40 బృందాలుగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చిలకలూరిపేట జవహర్ నవోదయ (మద్దిరాల) విద్యార్థుల బృందం ప్రథమ స్థానంలో, ఏపీ మోడల్ స్కూల్ నూజండ్ల విద్యార్థులు ద్వితీయ స్థానంలో, ఏపీ మోడల్ స్కూల్ వినుకొండ విద్యార్థుల టీమ్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో రెంటచింతల వివేకానంద టెక్నో స్కూల్ ప్రథమ స్థానంలో, నరసరావుపేట అక్స్‌ఫర్డ్ స్కూల్ ద్వితీయ స్థానంలో, గురజాల అక్షర స్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో చిలకలూరిపేటలో నిర్వహిచే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుండి ప్రథమ స్థానాల్లో నిలిచిన బృందాలు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలకు సాధినేని చౌదరయ్య స్కూల్ డైరెక్టర్ సిహెచ్ ప్రభాకరరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ బి.వీరాంజనేయులు, డాక్టర్ పివి సుబ్బారావు ప్రదానం చేశారు. జెవివి జిల్లా అధ్యక్షులు డి.బుచ్చిబాబు, కార్యదర్శి జెవికె ఎస్ ప్రసాద్, నాయకులు చలపతిరావు, రమేష్, సమత విభాగం జిల్లా అధ్యక్షులు అయేషా సుల్తానా, కె.శ్రీనివాసరెడ్డి, ప్రతాప రెడ్డి, డి.రమేష్‌బాబు, సృజన పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

300 మందికి కంటి వైద్యసేవలు



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని భట్లూరులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో సుమారు 300 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. శుక్లాలు వున్న వారిని గురించి ఆపరేషన్ చేయడానికి తేదీలు కేటాయించారు. శిబిరం నిర్వాహకులు ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ మాట్లాడుతూ మన ప్రాంతం మన బాధ్యత అనే నినాదంతో ఫౌండేషన్ ద్వారా ఐదేళ్లుగా సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 450 కార్యక్రమాల చేశామన్నారు. వందలాది మంది ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో ఎన్నారైలు మరింత ముందుకు రావాలని, ఆసక్తి ఉన్న విద్యార్థులకు చేయూత నందించాలని కోరారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. న్యాయవాది ఎం.హరిబాబు, సర్పంచ్ రామారావు, యతీష్ పోపూరి, శ్రీను, ఫౌండేషన్ ప్రతినిధులు కిరణ్ కుంచనపల్లి, సిద్ధయ్య, ప్రసాద్ కొండవీటి, వెంకట్, సురేష్ వెల్లలచెరువు, భావన రాంబాబు, నాగేశ్వరావు, పద్మ పాల్గొన్నారు.

పొగాకు సాగులో మెలకువలపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

పొగాకు పంటలో రైతులకు అధిక దిగుబడితో పాటు అధిక లాభాలు వచ్చే విధంగా సిటిఆర్ఐ, ప్రభుత్వ సంస్థ జిపిఐ సంస్థతో సంయుక్తంగా శాస్త్రవేత్తలతో రైతులకు సూచనలు అందిస్తున్నామని సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ చెప్పారు. మండలంలోని బ్రాహ్మణపల్లిపల్లిలో పొగాకు క్షేత్ర ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. పొలాలను విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సి.చంద్రశేఖరరావుతో కలిసి డాక్టర్ శేషుమాధవ్ పరిశీలించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పొగాకు అవసరం మరింతగా పెరిగిందని, దానికి అనుగుణంగా రైతులను సాగు పద్ధతులు అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో జిపిజి మేనేజర్ జి.రమేష్ రాజు, వినుకొండ ఏరియా బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.వీరారెడ్డి, మేనేజర్ గోవిందు వినయ్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

విజయవంతంగా నవోదయ మోడల్ గ్రాండ్ టెస్టు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణం కొత్తపేటలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో శ్రీ సాయి మధుర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. పరీక్షకు నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన 230 మంది విద్యార్థులు హాజరయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన వారికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఎన్.చరిత రూ.2 వేలు, ద్వితీయ బహుమతి ఎస్.మాన్విత రూ.1500, తృతీయ బహుమతిని వై.రేష్మశ్రీ రూ.వెయ్యి అందుకున్నారు. మరో 11 మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్

నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముప్పాళ్లలోని ఆచార్యులు హాస్పిటల్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆర్ఎంపి వైద్యులు నారాయణం శ్రీనివాసచార్యులు, గ్రామ పెద్దలు పోలిశెట్టి రామారావు ప్రారంభించారు. 180 మందికి నెల్లూరి హాస్పిటల్ న్యూరాలజీ వైద్య నిపుణులు నెల్లూరి రమేష్ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. దీంతోపాటు పరీక్ష చేయించుకున్న ప్రతిఒక్కరికీ ఒక మొక్కను అందించారు. వాటిని పెంచాలని, చెట్లు ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచి ఆరోగ్యాన్ని పొందొచ్చని డాక్టర్ రమేష్ చెప్పారు.



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

బాలికా సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

బాలికల సంరక్షణ అవసరాన్ని వివరిస్తూ జీవి అకాడమీ విద్యా సంస్థల్లో 'బాలికా సంరక్షణ -తల్లి బాధ్యత' అంశంపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల సమస్యలు, వారితో మాట్లాడి వాటిని తెలుసుకోవాల్సిన విధానం, ప్రవర్తన సరళిపై పలు సూచనలు చేశారు. సెల్‌ఫోన్లను అవసరం మేరకే ఉపయోగించాలని, సామాజిక మాధ్యమాలకు పిల్లల్ని వీలైనంత దూరంగా ఉంచాలని చెప్పారు. జీవి అకాడమీ విద్యాసంస్థల చైర్మన్ గోపీచంద్ వీడియోద్వారా తన సందేశాన్ని ఇచ్చారు. బాలికలతో ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వెంటనే ఖండించేలా వారికి ధైర్యాన్ని చెప్పాలని అన్నారు.

గిరిజన హక్కులను తాకట్టు పెట్టేలా సభ

ప్రజాశక్తి - చిలకలూరిపేట : విజయవాడలో గిరిజన శంఖారావం సభను గిరిజన హక్కులను తాకట్టు పెట్టేలా రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్ నిర్వహించారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ విమర్శించారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ వాల్మీకి బోయ, ఇతర సామాజిక తరగతులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ కేంద్రానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనలు పంపించినప్పుడు పదవులు అనుభవిస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తూ కార్పొరేషన్ రుణాల్లేకుండా చేసిన ప్రభుత్వానికి మద్దతుగా సభ సరికాదన్నారు.

పొలాలకు సాగర్ నీరివ్వాలి

ప్రజాశక్తి - నాదెండ్ల : సాగర్ కుడి కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జి.నాగపూర్ణచంద్రరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. సాగర్ కాల్వలకు నాలుగేళ్లుగా మరమ్మతులు చేయలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.



కళాకారుల సంక్షేమ సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ ప్రాంత కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంపటి మహేష్ అధ్యక్షతన సంఘం సమావేశం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం 2024 కేలండర్‌ను, కాశినేని వెంకట సుబ్బారావు రచించిన 'రణరంగం' అనే సాంఘిక నాటక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్కే సత్తార్, జి.ఆంజనేయులు, సిహెచ్.గోవిందు మాట్లాడుతూ బీమా పథకాలు, ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డులు, పథకాలపై అవగాహన కల్పించారు. ఎన్.వెంకటేశ్వరరావు, సిహెచ్.జ్ఞానసుందర రావు, బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వరరావు, వాల్మీకి, ఆర్.కరిముల్లా, నాగమల్లేశ్వరరావు, సత్యం, ఆర్.ప్రసన్న కుమార్, ఒ.సాల్మన్‌రాజు, ఎజ్రా, మార్కు పాల్గొన్నారు.

లగడపాడులో గ్రంథాలయం ఏర్పాటు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లగడపాడులో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్వర్యంలో నూతన గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉపసంచాలకులు కె.వి సుబ్బారావు మాట్లాడుతూ సమాజానికి విజ్ఞానం, విభిన్న సంస్కృతులు తెలియాల్సిన అవసరం ఉందని, జ్ఞానాన్వేషణకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని చెప్పారు. గ్రంథాలయాన్ని సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం ఏర్పాటు చేయగా, రమాదేవి, ప్రొఫెసర్ ఏలియ, వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, వెంకట్రావు పాల్గొన్నారు.

పేదలకు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ : ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు సాయంలో భాగంగా వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జీవి మాధవరావు కార్యాలయం వద్ద బియ్యం, నూతన వస్త్రములు అందజేశారు. పాలడుగు కుమారస్వామి దంపతులకు ప్రత్యేక నగదు సాయం అందించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సచివాలయ విభాగ కమిషనర్ ఎ.రాధాకృష్ణమూర్తి హాజరయ్యారు. ఎంవి శర్మ, బి.సుబ్రహ్మణ్యం, డి.నాగేశ్వరావు, ఎస్.ఎస్.ఎం. శాస్త్రి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

విలేకరి ఆళ్ల అనిల్ కుమార్ తల్లి సీతారామమ్మ 3వ వర్ధంతి సందర్భంగా స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు జి.వెంకటేశ్వర్లు, సీతారామమ్మ కోడలు భానుసంధ్య, మనుమరాళ్లు గాయత్రి, జయశ్రీ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రణాళికతో కష్టపడితే లక్ష్యం సాధించవచ్చు : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి- పెదకాకాని రూరల్ :నేటి విద్యార్థులకు మంచి సౌకర్యాలు, సదుపాయాలు లభ్యమవుతున్నాయని, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వంటి సంస్థలు ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు మంచి ప్రణాళికతో కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చునని ఎమ్మెల్సీ కె. ఎస్. లక్ష్మణరావు అన్నారు. ఆదివారం పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారులో గల కౌండిన్యపురం లోని కౌండిన్య ఐఎఎస్ అకాడమీ భవనంలో కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ స్కాలర్ షిప్స్ ప్రధానోత్సవ సభలో లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరుఅయ్యారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇ వి నారాయణ అధ్యక్షత వహించారు. లక్ష్మణ్ రావు ప్రసంగాన్ని కొనసాగిస్తూ అధ్యాపక ఉద్యమాలలో అత్యంత కీలకపాత్ర పోషించిన డాక్టర్ ఇ వి.నారాయణ ప్రిన్సిపల్ గా పదవీ విరమణ తర్వాత ఇంతటి బహత్తర కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఏ వ్యక్తి అయినా జీవితంలో మంచి మార్పుకు విద్య ఒకటే మార్గమని దాని ద్వారానే దేనినైనా సాధించవచ్చునని విశ్వసించే ఆయన విద్యారంగంలో ఒక ఋషిగా గా మారారు అన్నారు. విద్య సమాజంలో మార్పుకు మూల ఆయుధమని, ఆ ఆయుధంతో కుటుంబ పరంగానే గాక సమాజాన్ని ఎంతో ప్రభావితం చేయవచ్చును అన్నారు. వ్యవస్థను పూర్తిగా మార్చవచ్చునన్నారు. స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులు చదువుకొని ఉన్నత పదవులు అందుకోవాలని లక్ష్మణరావు ఆకాంక్షించారు .సభలో పాల్గొన్న కమర్షియల్ టాక్స్ విశ్రాంత అదనపు కమిషనర్ వై సత్యనారాయణ,టొబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు, డాక్టర్ మంజుల, అవనిగడ్డ ప్రగతి ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్ ఎస్ పూర్ణచంద్రరావు, ప్రముఖ ఆడిటర్ నండూరి ఆనందకష్ణ, మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే అశోక్ రావు ,పారిశ్రామికవేత్త ఆర్ ప్రసాద్ జడ్పిటిసి సభ్యులు ఆర్ కళ్యాణి ,రాంగోపాల్ గౌడ్, వడ్డేంగుంట సుబ్బారావు, ట్రస్ట్ సభ్యులు జల్లెడ శ్రీనివాసరావు ,బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు ,వీరంకి రంగారావు ,పీతా సుబ్బరామయ్య, చిలక చంద్రమౌళి ,బెల్లంకొండ సదాశివ గౌడ్ ,కారంకి లక్ష్మీనారాయణ ,డి సత్యనారాయణ, డాక్టర్ టి సేవ కుమార్ ,డాక్టర్ తాతా సాంబశివరావు అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గౌడ జన సేవా సమితి ,కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డప్పు కళాకారులతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న

కెఎల్‌యులో ఘనంగా యువజనోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ :రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలు స్థానిక కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు ముఖ్యఅతిథులుగా పాల్గొని యువజన ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారత యువతకు సరైన దిశా నిర్దేశం చేయడానికి స్వామి వివేకానంద లాంటి ఆధ్యాత్మిక గురువులు అవసరమన్నారు. యువజన ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన యువ బృందాలు వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కే శారద దేవి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని 10వ తేదీన ప్రత్యేక బస్సుల ద్వారా మహారాష్ట్రలోని నాసిక్ లో జరిగే జాతీయ యువజన ఉత్సవాలకు వెళతారన్నారు. జిజ్ఞాస ఫౌండేషన్ డైరెక్టర్ భార్గవ మాట్లాడుతూ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని, వీటి ద్వారా రానున్న కాలంలో యువత స్టార్టప్‌లుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి అనేకమందికి ఉద్యోగాలను ఇచ్చే స్థాయికి ఎదిగేలా చేయడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ పనిచేస్తుందన్నారు. జిజ్ఞాస ఫౌండేషన్ , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న యువజన సర్వీసులు యువజన ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అత్యంత ప్రతిభావంతులైన వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీఎస్.రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ స్వామి, వర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జి పార్థసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు



క్రీడల్లోనూ నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ గంజి చిరంజీవి అన్నారు. మంగళగిరి పట్టణంలోని వీటి జేఎం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాలలో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్విటేషనల్ ఛాంపియన్ షిప్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి గంజి చిరంజీవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్ తో ప్రతి ఒక్కరూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చునని అన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉత్తమ క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహం అందిస్తానని చిరంజీవి తెలిపారు. సుమారు 200 మంది చిన్నారులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



డాక్టర్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న అవగాహన సంస్థసభ్యులు

ఆందోళన కలిగిస్తున్న లివర్, జీర్ణకోశ సమస్యలు

ప్రజాశక్తి-గుంటూరు

గ్యాస్ ట్రబుల్ సమస్య పట్ల నిర్లక్ష్యం మంచిది కాదు అని, అది భవిష్యత్తులో రకరకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని అని ప్రముఖ గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ పోసాని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన గ్యాస్ట్రిక్, జీర్ణకోశ, పాంక్రియాస్, గాల్‌బ్లాడర్ సమస్య లపై అవగాహన కల్పించారు.ఆహారం తీసుకునే విషయంలో సమయపాలన పాటించకుండా, పౌష్టిక ఆహారం తీసుకోకుండా, జంక్‌ఫుడ్స్, రకరకాల కెమికల్స్ కలిపిన పానీయాలు, నిల్వ పచ్చళ్ళు, మసాలాలు, టీ, దుంపకూర వంటివి ఎక్కువగా తీసుకుంటూ, అధికంగా నొప్పుల బిళ్ళలు వాడటం వల్ల గ్యాస్‌ట్రుబల్ సమస్య వస్తుంది అని తెలిపారు. అది ఎక్కువైతే అల్సర్ తయారై చివరకు క్యాన్సర్‌కు దారి తీస్తుందన్నారు. మానసికవత్తిడి వలన కూడా గ్యాస్‌ట్రుబల్ వస్తుందని, దీని వల్ల ఆకలి మందగించడం, బరువు తగ్గడం సంభవిస్తాయని చెప్పారు. షుగర్ వ్యాధి అదుపులో లేకపోవటం, ఆహారంలో పీచుపదార్థం తగిన మోతాదులో లేకపోవటం వల్ల మలబద్ధకం సమస్య వస్తుందన్నారు. బీరకాయ, సొరకాయ, మొక్కజొన్న, కీరదోసకాయ, క్యారెట్ వంటివి మనం తినే ఆహారంలో చేర్చు కుంటే మంచిదని, ముఖ్యంగా ఎరుపు రంగులో ఉండే కూరగాయలలో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా లభిస్తాయని చెప్పారు. మిల్లెట్స్‌తో ఇడ్లీ, దోశె వంటివి తయారుచేసుకొని తింటే మంచిదన్నారు. గ్యాస్ సమస్యకు మందులు అనవసరంగా వాడితే అజీర్ణ సమస్య ఏర్పడి మలబద్ధకంకు దారితీస్తుందని తెలిపారు. రోజుకు కనీసం 3 లీటర్లు నీటిని త్రాగాలన్నారు. సభలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రంగయ్య, రావి రంగారావు, శాంత కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గం : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు : న్యాయమైన తమ డిమాండ్స్ పరిష్కరించాలని ఉద్యమం చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించి, ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం దుర్మార్గమైన చర్యని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయమని అడుగుతుంటే కాలం చెల్లిన చట్టాలు, కేసులు పెట్టి బయపెట్టడం వంటి చర్యలు గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు.తక్షణమే ఎస్మా చట్టం ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.



మత్యుంజయరావు దంపతులను సత్కరిస్తున్న విసి రాజశేఖర్ తదితరులు

మృత్యుంజయరావుకు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి- తెనాలి : విద్యావేత్త, సామాజిక సేవా తత్పరుడు మొవ్వ మృత్యుంజయరావును తెనాలి రామకృష్ణ అకాడమీ జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించడం అభినందనీయమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పి రాజశేఖర్ అన్నారు. పట్టణానికి చెందిన తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన పురస్కార ప్రధాన ఉత్సవంలో విసి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అకాడమీ అధ్యక్షులు డాక్టర్ ఐయినాల మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో మత్యుంజయరావు దంపతులను తెనాలి రామకృష్ణ జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీ విసి మాట్లాడుతూ 12 మాస్టర్ డిగ్రీలు చేసిన మత్యుంజయరావు ప్రస్తుతం యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్నాడని, ఆయనకు పురస్కారం అందించడం ఆనందంగా ఉందన్నారు. జస్టిస్ శివశంకర్ మాట్లాడుతూ విద్యావేత్తగానే కాకుండా ఎడ్యుకేషనల్ ఎంకరేజ్మెంట్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవదృక్పథంలో ఉన్న మత్యుంజయరావు అభినందనీయులన్నారు. సభలో జెకెసి కళాశాల అధ్యాపకులు సుధాకర్, విశ్రాంత డీఈఓ రఘుకుమార్, సిహెచ్ మంజుల, గల్లా మధుసూదన్ కుమార్, వర్సిటీ జర్నలిజం విభాగాధిపతి అనిత ప్రసంగించారు. కార్యక్రమంలో వెలగా సుభాష్ చంద్రబోస్, ఆరాధ్యుల కన్నా పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆళ్లకు పడాల రామారావు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరరావు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు ప్రముఖ గ్రంధకర్త పడాల రామారావు పురస్కారం అందుకున్నారు. రాజమ హేంద్ర వరంలోని ఆస్తిక డిగ్రీ కళాశాల్లో శనివారం రాత్రి కేంద్ర సాహిత్య అకాడమి, ఏపి అభ్యుదయ రచయితల సంఘం, ఆస్తిక కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, గ్రంధ కర్త పడాల రామారావు శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పడాల రామారావు స్మారక పురస్కారాన్ని ఆళ్ళకు ప్రధానం చేసి సత్కరించినట్లు ఆయన ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మినారాయణ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరి శివప్రసాద్, డాక్టర్ కె రామారెడ్డి, పడాల పడాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన పలువురు సాహితీ ప్రియులు ఆళ్ళను అభినందించారు.

శ్రీవేద డైరెక్టర్ రూ.55 వేలు వితరణ

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో రెండు రోజుల క్రితం బండ్లమూడి నల్లారావు ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన తెలుసుకొని ఆదివారం శ్రీవేద హైస్కూల్ యజమాన్యం, విద్యార్థు లు కలసి వారి గ్రామానికి వెళ్లి రూ.55వేలు నగదు, బట్టలు, వంటకు కావలసిన వంటపాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవేద హై స్కూల్ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయటం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం వలన వారికి సహాయం చేసే స్వభా వం కలుగు తుందని అన్నారు. కార్యక్రమం లో శ్రీ వేద ప్రిన్సిపాల్ అంబటి ఏడుకొండలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



తక్షణమే కౌలు చెల్లించాలి : ముప్పాళ్ల

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని రైతులకు తక్షణమే కౌలు చెల్లించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులోని రైతు దీక్ష శిబిరంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజధాని రైతులకు గత ఏడాది మే నెలలో చెల్లించాల్సిన వార్షిక కౌలును 2024 జనవరి వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. మూడేళ్లుగా అసైన్డ్, లంక రైతులకు కూడా కౌలు చెల్లించకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజధానిని నిర్మించాల్సిందేనని, అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మాత్రం నిర్మాణం వదిలేసి కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అమరావతి పెన్షన్ ను రూ2,500 నుంచి రూ 5 వేలకు పెంచుతామని చెప్పి మాట తప్పారని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను



నెరవేర్చలేనని చెబుతూ సంక్రాంతి లోపు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. కౌలు చెల్లించాలని, రైతుల ప్లాట్లను అభివృద్ధి చేయాలని, అమరావతి పెన్షన్ రూ 6వేల కు పెంచాలని, అసైన్డ్, లంక రైతులకు బకాయి ఉన్న కౌలు మొత్తాన్ని చెల్లించాలని తదితర డిమాండ్లతో సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడ సిఆర్డిఏ కార్యాలయంలో కమిషనర్ వినత పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు ముప్పాళ్ళ శివశంకరరావు, జివి రాజు, షేక్ నాగుల్ మీరా వలి పాల్గొన్నారు.

నాదెండ్ల రామారావుకు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు



పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ రామారావు

ఉపాధ్యాయ వృత్తిలో మూడు దశాబ్దాలకు పైగా తనదైన ముద్ర వేస్తూ, నేటి యువతలోని నైపుణ్యాలను వెలికి తీస్తూ ఎంతో మంది విద్యార్థుల జీవితాలకు మార్గనిర్దేశం చూపించిన చలపతి ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు 2023 సంవత్సరానికి జీవితకాల సాఫల్య పురస్కారం సొంతం చేసుకున్నారు. ఈనెల 6, 7 తేదీల్లో రాజమండ్రిలోని వి.జె. ఫార్మసీ కాలేజిలో నిర్వహించిన వేడుకల్లో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ దీపేంద్రసింగ్, సౌత్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యం.వి.రమణ, ఈసీ సభ్యులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ ఎన్.ఎల్.ఎన్ ప్రసాద్‌రెడ్డి తదితరుల చేతులమీదుగా రామారావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ వై.సుజిత్, అధ్యాపకులు రామారావుకు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి

విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య

ప్రజాశక్తి-గుంటూరు

అధ్యాపకులు, కౌన్సిలర్లు తరగతి గదిలోని విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఎంపవరింగ్ త్రూ ప్రివెన్షన్-ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఆన్ లైఫ్ సేవింగ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజుల పాటు అధ్యాపకులకు, కౌన్సిలర్‌లకు నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా లావు రత్తయ్య మాట్లాడుతూ అధ్యాపకులు వారి పరిధిని దాటి సృజనాత్మకంగా, సరికొత్తగా ఆలోచించేలా ప్రేరేపించాలన్నారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు అది విద్యార్థి సమస్యలా భావించకుండా తానైతే ఎలా ఎదుర్కొంటారో ఆ విధంగా పరిష్కరించాలన్నారు.వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ మనసంతా ప్రతికూల ఆలోచనలతో నిండిపోతే ఏ పనీ చేయాలనిపించదన్నారు. గతంతో మొదలుపెట్టిన పనినీ చివరి వరకూ కొనసాగించలేరన్నారు. కావున ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా సానుకూల ఆలోచనలతో జయించవచ్చనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఏఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణభరత్, ఉస్మానియా యూనివర్సిటీ యూజీసీ హెచ్‌ఆర్‌డీసీ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ పి.స్వాతి, హైదరాబాద్‌లోని పీడియాట్రిక్ సైకాలజిస్ట్ గంగాధర్‌బరెడ్డి తదితరులు ప్రసంగించారు.



చెకుముకి ప్రశ్నా పత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సమాజంలోని సమస్యలకు పరిష్కారం కనుగొనేది శాస్త్రవేత్తలేనని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని జిఎస్ఆర్ పబ్లిక్ స్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ప్రారంభ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, శ్రావణి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పోసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొని సైన్స్ సంబరాలు పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో చదువుకున్న వారు కూడా శాస్త్రీయ ధృక్పదం కలిగి ఉండట్లేదన్నారు. విద్యార్థులు శాస్త్రీయ ధృక్పదం అలవర్చుకోవాలని, మూఢనమ్మకాలు నమ్మవద్దన్నారు. గత 35 సంవత్సరాలుగా విద్యార్థులకు జెవివి చెకుముకి నిర్వహించటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుండి 36 టీములు పాల్గొన్నాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో కొండవీడు పబ్లిక్ స్కూల్, సిఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గొట్టిపాడు జెడ్పీ హైస్కూల్, మందడం జెడ్పీ హైస్కూల్, మంగళగిరి బిఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు డాక్టర్ ఎ.ఎస్.ప్రసాద్, టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, ఎస్.కె.అహ్మద్ హుస్సేన్, టి.ఆర్.రమేష్, చాందిని, బి.ఉదయభాస్కర్, బి.శంకర్‌సింగ్, ఇ.రాధ, కె.సాయి, యం.కోటేశ్వరరావు, వీరనారాయణ, జి.వెంకటరావు తదితరులు పర్యవేక్షించారు.

19వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు


గుంటూరు సమ్మె శిబిరంలో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

విద్యాశాఖలో సమగ్రశిక్షా ఉద్యోగులను విలీనంచేసి, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టరేట్ సమ్మె శిబిరంలో ఉద్యోగులు పాల్గొని నిరసన తెలిపారు. జెఎసి జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, అబ్దుల్ రెహమాన్, కోశాధికారి యం.గంగయ్య, కె.కిరణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వం ఆర్థిక పరమైన డిమాండ్లతోపాటు, ఆర్థికేతర అంశంమైన హెచ్‌ఆర్ పాలసీ డిమాండ్‌ను కూడా పట్టించుకోవేట్లేదన్నారు. నాలుగున్నరేళ్ళ పాలనలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో నాయకులు చంద్ర, చలపతి, సుభాని, సుజీత్, వినోద్, అరుణ్, గౌరి, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా


నరసరావుపేటలో సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు ఎం మోహన్ రావు

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఏపి సమగ్ర శిక్షా కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఎస్ పి డి కార్యాలయం ముట్టడి సందర్భంగా ప్రభుత్వం పోలీసులు ప్రయోగించి అరెస్టులు చేయడానికి తీవ్రంగా ఖండించారు. అరకొర వేతనాలతో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఏమాత్రం సరి పోవటం లేదని తక్షణమే ముఖ్యమంత్రి న్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం మోహనరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా నెల రోజుల ముందే ప్రభుత్వానికి సమగ్ర శిక్షా అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్నామని చెప్పారని నెలరోజుల సమయంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు అవుట్ సోర్సింగ్ పార్ట్ టైం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులందరూ సమ్మెలోకి దిగారన్నారు. ఎస్ పి డి కేజీబీవీ సెక్రటరీ ఉద్యోగుల పట్ల అప్రజా స్వామికంగా వ్యవహరిస్తూ రాజ్యాంగం ఉల్లంఘనకు కోర్టు దిక్కారానికి పాల్పడుతు న్నారన్నారు. యుటిఎఫ్ శావల్యాపురం మండల ప్రధాన కార్యదర్శి అల్లి చిన కోటేశ్వరరావు, మురికిపూడి సుబ్రమణ్యం, అఖిల భారత గిరిజన ఉద్యోగుల యూనియన్ పల్నాడు జిల్లా బాధ్యులు ఎన్. శ్రీనివాస నాయక్, పి.ఏడుకొండలు,కె శ్రీనివాస రావు,ఏ నాగేశ్వర నాయక్, వి లాలూ నాయక్, ఎం శ్రీనివాసరావు తదితరులు ఆందోళనకు మద్దతు తెలిపి ప్రసంగించారు.

హియరింగ్ హ్యాండిక్యాప్డ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్.నాగూర్ షరీఫ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హియరింగ్ హ్యాండిక్యాప్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటరెడ్డి, కార్యదర్శి కె.గోపీచంద్, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నగర అధ్యక్షులు ఎస్‌పిఎస్ సూరి, అనిల్‌కుమార్, మారియలు, ఉన్నం హనుమంతరావు, ఎపిహెచ్‌ఇఎ నాయకులు పి.రాజు, ఎ.కృష్ణప్రసాద్, బి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

- **రూ.350 కోట్లతో అభివృద్ధి పనులు**
- **ప్రజలకు అందుబాటులో అర్బన్ హెల్త్‌సెంటర్లు**
- **ప్రజాశక్తితో మేయర్ కావటి మనోహర్ నాయుడు**



గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో రహదారులన్నీ చిన్నాభిన్నం అయ్యాయని వీటిని తిరిగి మెరుగపర్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 70 శాతం రహదారులు మెరుగుదలకు వచ్చాయని రానున్న కొద్దినెలల్లో ప్రధాన రహదారులన్నీ మెరుగుపరుస్తామని వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.



రహదారుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు?

గుంటూరులో 2014 నుంచి 2019 వరకు రహదారుల నిర్మాణం జరగలేదు. భూగర్భ డ్రైనేజిపనుల వల్ల అన్ని రహదారులు తవ్వేసి వెళ్లిపోయారు. 2021లో తమ కౌన్సిల్ అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చాం. మొదటి దశలో రూ.70 కోట్లతో అత్యవసర రహదారులను నిర్మించాం. మరో రూ.100 కోట్లతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఎటి అగ్రహారం వంటి ప్రధాన రహదారులను కూడా అభివృద్ధి చేస్తున్నాం.రామనామక్షేత్రం రహదారి, కంకరగుంటనుంచి బేకర్స్‌ఫన్ వరకు ప్రధాన రహదారిని అభివృద్ధి చేశాం. లక్ష్మీపురం, బ్రాడీపేట మెయిన్ రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాం.మరో రూ.180కోట్లతో ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు?

గుంటూరులో 23 అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరు అయ్యాయి. వీటి నిర్మాణంలో క్షేత్రస్థాయిలో వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఏర్పడింది. తూర్పు నియోజకవర్గంలో 12, పశ్చిమ నియోజకవర్గంలో 11 మంజూరు అయ్యాయి. వీటితో నగరంలో వైద్య పరంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రాథమిక వైద్యం అందుతోంది.

టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు?

టిడ్కో ఇళ్ల అప్పగింత వేగంగా జరుగుతోంది. అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయంలో 10 బ్లాక్ ల్లో లబ్దిదారులకు పట్టాలు, ప్లాట్ తాళాలు అందిచారు. అడవితక్కెళ్లపాదులోని 101 బ్లాక్ లకు సంబంధించి 300, 365, 425 చదరపు అడుగుల ప్లాట్ లను బ్లాక్ ల వారీగా క్రమ పద్దతిలో300 చదరపు అడుగుల ప్లాట్ లు దశల వారీగా ఈనెల 12లోగా అప్పగింత పూర్తవుతుంది. అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చాం. తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయం కల్పించాం.

నగరంలో పార్కుల అభివృద్ధి?

గుంటూరులో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. నగరంలో అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. గాంధీ పార్కును దాదాపు రూ.6 కోట్లతో అభివృద్ధి చేశాం.పెద్దలు, పిల్లలకు పార్కులలో సేద తీరేలా తీర్చిదిద్దుతున్నాం. వ్యాయం కోసం కొన్ని పరికరాలు, ఆట వస్తువులు కూడా అమరుస్తున్నాం. సందర్శకులు వీటిని పాడు చేయకుండా ఉపయోగించుకోవాలి.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి